క్లుప్తంగా

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు



కోస్గి: వ్యాపారులు ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించినా జరిమానాతో పాటు కేసులు సైతం నమోదు చేస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. 120 మైక్రాన్ల కన్న తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వినియోగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. నిబంధనలు పాటించని దుకాణాదారులకు జరిమానా విధిస్తామన్నారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లు వాడితే రూ.1000 నుంచి రూ.25 వేల వరకు జరిమానా తప్పదన్నారు. కార్యాక్రమంలో అధికారులు, సిబ్బంది విజయ్ భాస్కర్, ఆవుల రఘు, అర్బాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకే ప్రవేశాలు కల్పించాలి

మరికల్: కస్తుర్బా పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్ల కస్తుర్బా గాంధీ పాఠశాలలో పేద విద్యార్థులకు అడ్మిషన్లు దొరకడం లేదన్నారు. పేద విద్యార్థుల నోట్లో మట్టి కొడుతున్న అధికార పార్టీ నాయకులు క్షమించరాని తప్పు చేస్తున్నారని మండిపడ్డారు. అవకతవకలకు చోటు ఇవ్వకుండా అర్హులైన పేద, తల్లిదండ్రులు లేని, వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలను కస్తుర్బాలో చేర్చుకోవాలని ఎస్‌వోకు సూచించారు.

మహిళలపై దాడులను అరికడదాం

మద్దూరు: సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను, బాల్యవివాహాలను అరికట్టడానికి భూమిక ఉమెన్స్ కలెక్టివ్ పనిచేస్తుందని సంస్థ ప్రతినిధులు నాగమ్మ తెలిపారు. మంగళవారం మద్దూరులోని భూమిక కార్యాలయంలో సంస్థ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. మద్దూరు, దామరగిద్ద మండలంలో భూమిక సంస్థ ద్వారా బాల్య వివాహాలను అరికట్టడం, మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ సహాయం చేస్తుందని ఇందు కోసం మనమందరం కలిసి పని చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నరేష మోహన్, కేసిబాయి, భీమరాజ్, కృష్ణయ్య, చిన్నయ్య, లాలప్ప, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన మంత్రి



నర్వ: మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఉందేకోడ్‌లో బోరు వేయడంతో తమ తాగునీటి కష్టాలు తీరాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి బోరుమోటర్‌ను స్విచ్‌ఆన్ చేశాడు. నీళ్లు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రేటరీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, కొండన్న, నాగప్ప, ఉమాపతి, నర్సింహా, రాజారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ



కృష్ణా: మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో నూతన ఆర్వో ప్లాంట్‌ను స్థానిక నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శేఖర్ మాట్లాడుతూ కొంత కాలంగా విద్యార్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో గమనించిన కొత్తూర్ వెంకటమ్మ కుటుంబ సభ్యులు ఆర్వో ప్లాంట్‌ను ఉచితంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నిజాముద్దీన్, ఎంపీఓ విజయలక్ష్మీ, కాంప్లెక్స్ హెచ్‌ఎం, స్థానిక నాయకులు భీమశంకర్, రాఘవేంద్రగౌడ్, బాల్‌రాజ్, వెంకటేష్, రాఘవేంద్ర, తమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో అమ్మవారు



మరికల్: ఆషాడ మాసం సందర్భంగా మరికల్ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు భక్తులకు మంగళవారం శాకంబరీ అలంకరణ రూపంలో దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణాలు చేసి పూజలు చేసి భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

అదనపు భారంతో అవస్థలు

- ఒకే డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో తప్పని తిప్పలు
- పనికి తగిన వేతనం కరువు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం



మాగనూర్‌లోని మండల పరిషత్ కార్యాలయం

మాగనూర్: మండలంలోని గ్రామపంచాయతీల్లో సరిపడా డేటా ఎంట్రీ ఆపరేటర్లు లేకపోవడంతో ప్రజలకు సత్వర సేవలు అందడం లేదు. అలాగే ఉన్న సిబ్బందితోనే అదనపు పనులు చేయిస్తుండడంతో ఉన్న సిబ్బంది పనిభారంతో సతమతమవుతున్నారు. మండలంలో ప్రస్తుతం 16 గ్రామ పంచాయతీలు ఉండగా డేటాఎంట్రీతో పాటు ఇతరత్రా పనుల కోసం గతంలో ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించింది. అయితే 16 గ్రామపంచాయతీలకు 16 మందిని నియమించకుండా ఒకరినే నియమించి వదిలేయడంతో ఉన్న సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. అలాగే వివిధ పనుల నిమిత్తం పంచాయతీకి వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందడం లేదు. ఉన్న ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ కూడా సిబ్బంది కూడా మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే విధుల్లో చేరినప్పటి నుంచి వీరికి కనీస వేతనాలు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అది కూడా ప్రతి నెలా 15వ తేదీ దాటితే కాని వేతనం రాదు. ఒక ఆపరేటరు ఒక క్లస్టర్ విధులు నిర్వర్తించాలి. ప్రస్తుతం ఒక్కరే మొత్తం క్లస్టర్ల విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పనికి తగిన వేతనం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది విభాగాలు ఆన్‌లైన్..

గ్రామ పంచాయతీలకు సంబంధించి ట్యాక్స్ కింద ఇంటిపన్ను, నల్లా బిల్లులు, నాన్‌ట్యాక్స్ కింద మార్కెట్ సెస్, రహదారి పన్ను, లైసెన్స్ ఎక్స్‌టాన్సన్, జనన, మరణ ధ్రువీకరణ ఇతరత్రా తొమ్మిది విభాగాలను వీరు ఆన్‌లైన్ చేయాలి.

డిజిటలైజేషన్ చేయడమే ముఖ్య ఉద్దేశం

ప్రతి గ్రామపంచాయతీని డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం కంప్యూటర్లు సరఫరా చేసింది. పదహారు జీపీల్లో 9 జీపీలకు కంప్యూటర్లు అందజేయగా, 1 గ్రామాల్లో మాత్రమే పనిచేస్తున్నాయి. 6 గ్రామాల్లో మూలనపడ్డాయి. అందులో 3 మండల పరిషత్ కార్యాలయంలో వినియోగిస్తున్నారు. ఒక ఆపరేటరు అధికారులు చెప్పిన అదనపు పనులతో పాటు గ్రామపంచాయతీలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు.



పనిలో నిమగ్నమైన డేటా ఎంట్రీ ఆపరేటర్

ఆపరేటర్లకు జీతాలు జీపీల నుంచి..

ప్రస్తుతం ఉన్న ఒక ఆపరేటర్‌కు కూడా జీతం ఆయా గ్రామ పంచాయతీ నుంచి నెలకు ఒక గ్రామపంచాయతీ తరఫున రూ.15వేలు అందజేస్తున్నారు. దీంతో చిన్న పంచాయతీలకు అదనపు భారం తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత లేదు

అవుట్ సోర్సింగ్ ద్వారా నియామకం అయ్యాం. పంచాయతీల నుంచి జీతాలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం అదే పద్ధతిలో జీతాలు పొందుతున్నాం. ఎన్నో ఏళ్లుగా నామమాత్రపు వేతనంతో పని చేస్తున్నాం. పనికి తగిన వేతనం లేవు. ఉద్యోగ భద్రత లేకపోగా పీఎఫ్, ఈఎస్‌ఐ తదితర సౌకర్యాలు లేవు. అకౌంట్‌లో జీతాలు పడవు. చెక్కులు ఇస్తున్న సమయానికి డబ్బులు ఖాతాలో జమకావడం లేదు.

– మహేశ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మాగనూర్

సమస్య పరిష్కారానికి కృషి



ఆపరేటర్ల విషయంలో ఉన్నతాధికారులు సానుకూలంగా ఉన్నారు. ప్రస్తుతం ఒక ఆపరేటర్ ఉండటం వల్ల కొంతమేర ఇబ్బందులు కలుగుతున్నా, పనుల విషయంలో ఆపరేటర్‌పై ఒత్తిడి లేకుండా మేము సహాయం చేస్తూనే ఉన్నాం. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలిజేస్తాం.

– శ్రీనివాసులు, ఎంపీడీఓ, మాగనూర్

ఉపాధ్యాయుల సంక్షేమమే తపస్ లక్ష్యం



కల్వాల ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న షేర్ కృష్ణారెడ్డి

నర్వ: ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా తపస్ పనిచేస్తుందని తపస్ జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్నారు. అనంతరం కల్వాల్, పెద్దకడ్మూర్, నర్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సభ్యత్వం నమోదు చేయించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వసంత్‌కుమార్, మండల నాయకులు శివశంకర్, నరేష్, రఘువర్మ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

మరికల్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న విద్యా రంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ సంఘం మండల అధ్యక్షుడు సురేష్ అన్నారు. మండలంలోని కన్మనూర్, మరికల్‌లో మంగళవారం తపస్ ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు చేపట్టి ఉపాధ్యాయులకు సభ్యత్వం కల్పించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తపస్ సంఘం నాయకులు శివ, సికిందర్, భాస్కర్, సురేస్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మద్దూరు: ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తపస్ రాష్ట్ర సేవా కన్వీనర్ నర్సప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా డిమాండ్ చేశారు. మండలంలోని దోరేపల్లి, జాదరావ్‌పల్లి, నందిపాడ్, చింతల్‌దిన్నే, నాగంపల్లి, దమ్‌గాన్‌పూర్, నాగిరెడ్డిపల్లి, మద్దూరులో తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించి సభ్యత్వం కల్పించారు.

బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

మక్తల్: మండలంలోని సంగంబండ కస్తూర్బా పాఠశాలతో పాటు గ్రామాల పాఠశాలల్లో ఉపాధ్యాయులకు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌స్వామి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేవరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామన్నారు.

ధ్యానంతో ఆత్మస్థైర్యం పెంపు

మరికల్: నిత్యం ధ్యానం చేయడం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ధ్యానం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధ్యానం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగడమే కాకుండా ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ప్రతిరోజు పది నిమిషాల పాటు ధ్యానం చేస్తే విద్యతో పాటు ఆరోగ్య పరమైన లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రచారకర్త సత్యనారాయణరెడ్డి, హెచ్‌ఎం నాగరత్నమ్మ, లక్ష్మీకాంత్ రెడ్డి, చెన్నారెడ్డి, జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు



కొత్తపల్లిలో భోనం ఎత్తిన మహిళలు

సాక్షి నెట్‌వర్క్: బోనాల సందడి మొదలైంది. మంగళవారం ధన్వాడ, మరికల్, కొత్తపల్లి, కోస్గి, నర్వలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.

- ధన్వాడలో గౌడ సంఘం, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మదెలమ్మ బోనాల వేడుకలు నిర్వహించారు. గ్రామపెద్దలు ముందుగా అమ్మవారికి పెద్ద బోనం సమర్పించారు. అనంతరం గ్రామస్తులు అంత కలిసి బోనాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.
- మరికల్‌లోని మాద్వార్ గ్రామంలో పోచమ్మ అమ్మవారికి మహిళలు ఊరేగింపుగా బోనాలతో వచ్చి నైవేద్యాలు సమర్పించారు.
- కొత్తపల్లిలోని మన్నాపూర్, కొత్తపల్లి తండాలో గ్రామ దేవత బోనమ్మ, మన్నాపూర్‌లో పోశమ్మ ఉత్సవాలు నిర్వహించారు. జల్ది బిందె, పల్లకి సేవ, అభిషేకం అనంతరం మహిళలు బోనం కుండలతో పుర వీధుల గుండా భాజ భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించి ఆలయ సమీపంలో అమ్మవార్లకు దాసాంగాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.
- నర్వలో యాంకి ఊర చెరువు కట్టపై వెలిసిన పోలేరమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా కురుమ కులస్తులు తమ ఇష్ట దైవమైన పోలేరమ్మ అమ్మవారికి అంబలి నైవేద్యాన్ని సమర్పించారు.
- కోస్గిలో ఊరడమ్మ గ్రామ దేవతకు బోనాల వేడుకకు అంతా సిద్ధం చేశారు. పట్టణ నడి బొడ్డున ఉన్న ఊరడమ్మ ఆలయాన్ని బోనాల వేడుక కోసం రంగులు వేసి ముస్తాబు చేశారు. కులాలకతీతంగా పట్టణంలోని ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.
- దామరగిద్దలోని కాన్‌కుర్తిలో స్వయంభుగా వెలిసిన మర్రిచెట్టు పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక గిద్దెగేరితో పాటు గ్రామ మహిళలు సామూహిక బోనాలతో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించారు.



మారెమ్మ ఉత్సవాల్లో గిరిజన మహిళలు



ధన్వాడలో..

సీసీ రోడ్డు పనులు ప్రారంభం




మాగనూర్: నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నేరడగం గ్రామంలో రూ.13 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టగా టెంకాయ కొట్టి ప్రారంభించారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కాంట్రాక్టర్ పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలప్ప, మాజీ ఎంపీటీసీ ఎల్లారెడ్డి, మల్లేపల్లి నాగప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకుంటాం

కోస్గి: పట్టణంలోని శంభుని గుడికి ఉన్న భూములను కొందరు ఆక్రమించి వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారని, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆలయ భూముల ఆక్రమణను అడ్డుకుంటామని ఆ పార్టీ నాయకులు వెంకట్ నర్సింములు, కోనెరు సాయప్ప అన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలయ భూములను స్వాహా చేసేందుకే ప్రభుత్వ పరంగా ఆలయ కమిటీలు ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే కొందరు తాత్కాలిక షెడ్లు నిర్మించి వ్యాపారులకు అద్దెకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఆలయ భూముల ఆక్రమణపై సమగ్ర వివరాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాల్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక



మక్తల్: ఆల్ ఇండియా సౌత్ జోన్ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు మక్తల్ మండలం జక్లేర్‌కు చేందిన వెన్నెల ఎంపికైందని విశ్రాంతి పీఈటీ, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. మక్తల్‌లో ఈనెల 13న నిర్వహించిన క్రీడల్లో జిల్లా స్థాయిలో ఇండియా బాలికలు సబ్ జూనియర్ విభాగంలో 5 కిలోమీటర్ల పోటీలలో వెన్నెల సత్తా చాటింది. దీంతో విద్యార్థినిని గోపాలం అభినందించి శాలువాతో సన్మానించారు. జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఇళ్లకు భూమిపూజ

కొత్తపల్లి: మండలపరిధిలోని లింగాల్ చేడ్ గ్రామ పంచాయతీలో మంగళవారం లబ్ధిదారుల నిర్మాణం తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీఓ కృష్ణారావ్ భూమిపూజ చేసి ఇళ్లకు మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 గజాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని ప్రభుత్వం విడతల వారిగా నగదు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్/నారాయణపేట: మండలంలోని అప్పక్‌పల్లి నుంచి కోటకొండ మీదుగా కోయిలకొండ వరకు నిర్మిస్తున్న డబుల్ లైన్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్డు పనులు నత్త నడకన సాగుతున్నాయని, కాంట్రాక్టర్ ఏడాది నుంచి రోడ్డు పనులను నిలిపివేయడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పాత రోడ్డును ధ్వంసం చేయడంతో గుంతలు ఏర్పడి ఆటో, కారు, జీపుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. వెంటనే కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాశీనాథ్, నరసింహ, సాబీర్, రమేష్, నాగప్ప, చందు, అంజి, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో చెరువులకు జలకళ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: నియోజకవర్గంలో సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మక్తల్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి చొరవతోనే రెండు నెలల ముందుగానే సాగుకు రిజర్వాయర్ల నుంచి నీటిని వదిలినట్లు తెలిపారు. మంత్రి కృషితోనే మక్తల్ నియోజకవర్గంలో 80 చెరువులు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లుగా అడ్డంగా దోచుకొని రూ.లక్షల కోట్లు అప్పులు చేశారని ఎద్దేవా చేశారు. గొర్రెల పంపిణీ పథకంలో బీఆర్‌ఎస్ హయాంలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందనే విషయాన్ని మంత్రి వాకిటి శ్రీహరి ప్రస్తావిస్తే దానిపై లేనిపోని ప్రచారం చేశారని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా నియోజకవర్గంలో అభివృద్ధి ఆగదన్నారు. కార్యక్రమంలో మక్తల్ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, గొల్లపల్లి నారాయణ, కట్టసురేశ్ , మాజీ ఎంపీటీసీ కొల్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వృథాను అరికట్టాలి



కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు, రైతులు

మాగనూర్: సంగంబండ కుడి లోలెవల్ కెనాల్ కింద గల రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పంట సాగు చేసుకోవాలంటే జంకుతున్నారు. దీనికి ముఖ్య కారణం నేరడగం, వర్కూర్ గ్రామాల రైతులు. గతంలో కంటే ఎక్కువగా మోటార్లను కాలవలపై ఏర్పాటు చేయడంతో పాటు సాగు నీటిని చెరువు ద్వారా వాగులోకి వృథాగా వదులుతున్నారని ఇతర గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న ఇరిగేషన్ అధికారులు మంగళవారం కాలువను పరిశీలించారు. వృథాగా వదిలిన నీటికి సంబంధించి కొంత మేర గండ్లను పూడ్చివేశారు. ఏటా మొదట ఉన్న రైతులు ఇలా చేయడం ద్వారా చివరి ఆయకట్టు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

పెద్దోళ్లు వస్తున్నారని.. చకచక పనులు



జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం వెనక ముళ్ల పొదలు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

నారాయణపేట రూరల్: పట్టణంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేయడానికి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లా కేంద్రానికి రానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అక్కడి పరిస్థితిని పరిశీలించడానికి మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ అక్కడి పరిసరాలు పరిశీలించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం చెత్తా చెదారం పేరుకుపోవడం, మురుగు నిలిచి అధ్వానంగా తయారవడంతో వెంటనే మున్సిపల్ సిబ్బందిని పిలిపించి శుభ్రం చేయించారు. అలాగే మిషన్ భగీరథ అధికారులతో కొళాయి కనెక్షన్ ఇప్పించారు. ఆగ మేఘాలపై మూత్ర శాలలు, మరుగుదొడ్లు బాగు చేయించారు. ఈ పనులన్నీ ట్రైనీ కలెక్టర్ దగ్గరుండి పూర్తి చేయించారు. దీంతో జిల్లా విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, లేబర్ కార్యాలయం, మండల పరిషత్, తహసీల్దార్, మండల వనరుల కేంద్రానికి ఒక కళ వచ్చినట్లు అయ్యింది.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కోస్గి: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్యారోగ్యా శాఖ ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుండుమాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిష్టమ్మ సూచించారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని సర్జఖాన్‌పేట గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. టీబీతో పాటు ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు నర్సింహారెడ్డి, వెంకట్ స్వామి, సిబ్బంది మణిమాల, శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, సాయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు వైద్యశిబిరాలు

నర్వ: కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ఆయా మండలాల్లో క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అధికారి సత్యపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దకడ్మూర్‌లో వైద్యశిబిరం నిర్వహించగా దాదాపు 160 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు చేశారు. ఇందులో క్షయవ్యాధి నిర్ధారణ కోసం ఎక్సరే పరీక్షలు చేసి మందులను అందజేశారు. వైద్యశిబిరంలో ప్రోగాం అధికారి డా.సత్యప్రకాష్‌రెడ్డి, నర్వ పీహెచ్‌సీ వైద్యులు డా.వెంకటరమణ, సీహెచ్‌ఓ రామునాయక్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

108లో ప్రసవం

మద్దూరు: 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించిన సంఘటన మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టి.అనితకు తెల్లవారు జామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కి ఫోన్ చేశారు. మద్దూరులో ఉన్న 108 వాహనం అక్కడి చేరుకొని అసుపత్రికి తరలిస్తున్న క్రమంలో నొప్పులు అధికమవడంతో వాహనంలోనే మగ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను నారాయణపేట జిల్లా అసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన ఈఎంటీ మహేష్, పైలెట్ మాణిక్యప్పను ఆస్పత్రి డాక్టరు, అనిత కుటుంబ సభ్యులు అభినందించారు.

డెంగీ కేసు నమోదు

దామరగిద్ద: మండలంలోని ఆశన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్లు వైద్యులు తెలిపారు. దీంతో వైద్యురాలు స్రవంతి సమక్షంలో మంగళవారం గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకర్, కిష్టమ్మ, అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్‌ఎం బాలచంద్రమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మక్తల్: మండలంలోని దాసర్‌పల్లి వాగు దగ్గర ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కటికెలి చంద్రశేఖర్, భాస్కర్ తమ ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలియడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

నారాయణ పేట క్రైమ్: మత్తపదార్థాలకు యువత దూరంగా ఉండాలని పేట పోలీసులు సూచించారు. మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, దొంగతనాల నియంత్రణపై మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మత్తు పదార్థాల వినియోగం పెరిగిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. అలాగే సైబర్ నేరగాళ్ల వలలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, సైబర్ నేరలకు గురైతే 1930కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. దొంగతనాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శిరీష, స్థానికులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

నారాయణపేట రూరల్: ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నారాయణపేట మాజీ ఎంపీపీ అమ్మకొళ్ళ శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం మంగళవారం ఇందిరా పార్క్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వైఖరి చూస్తుంటే మళ్లీ బీసీలని మోసం చేసే కుట్రగా స్పష్టమవుతుందన్నారు. ఆర్డినెన్సు ఎప్పుడు తీస్తారో చెప్పకుండానే రిజర్వేషన్లు అమలు అయ్యాయని సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.